

ట్యాంక్ ఎక్కిన కార్మికులు..
సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేసే డైలీవేజ్ వర్కర్లు వాటర్ ట్యాంక్ ఎక్కారు. 8లో



సొసైటీ సొమ్ము స్వాహా..
అశ్వాపురం మండలం నెల్లిపాక పీఏసీఎస్‌లో రూ.20 లక్షలు దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో కొంత చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

కృష్ణయ్య చెంత రామయ్యకు రాపత్తు సేవ



శ్రీకృష్ణాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా రాపత్తు సేవలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం శ్రీకృష్ణాలయంలో స్వామి వారికి రాపత్తు సేవ జరిగింది. తొలుత పల్లకిలో స్వామి వారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా శ్రీకృష్ణాలయానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, హారతి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన లవకుశ కళారూపం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అర్చకులు, వేదపండితులు, అంబసత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం
భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కనులపండువగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, బుధవారాన్ని పురస్కరించుకుని ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు.

రామాలయంలో 'నూతన' వేడుకలు



ఈఓ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు


భద్రాచలం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ బి.శివాజీ దంపతులను వైదిక కమిటీ, అర్చకులు, ఉద్యోగులు సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, హనుమాన్ శాస్త్రి, నిరంజన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి: జిల్లాలో ఖాళీగా ఉన్న 36 మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులన్నీ కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని, ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్ (2020 కి పూర్వం) ఉత్తీర్ణత పొంది ఉండాలని సూచించారు. బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు సీపీసీహెచ్ 6 నెలల బ్రిడ్జి కోర్సు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. అర్హత పత్రాలు జత చేసిన దరఖాస్తులను ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హస్తవ్యస్తం!

కాంగ్రెస్‌లో అనైక్యత.. అంతర్గత కుమ్ములాటలు
- డీసీసీ చీఫ్ పొదెం లక్ష్యంగా విమర్శలు
- సేవ్ కాంగ్రెస్ పేరుతో కార్యక్రమాలు
- హైదరాబాద్‌కు చేరిన పంచాయితీ
- పాదయాత్ర నాటికైనా నేతల తీరు మారేనా?



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ఉన్నా నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. ఎన్నికల ఏడాదిలోకి వచ్చినా జిల్లాలో నాయకుల మధ్య విబేధాలు తగ్గడం లేదు. నిన్నా మొన్నటి వరకు జిల్లాకే పరిమితమైన గొడవలు ఇప్పుడు రాష్ట్ర రాజధానికి చేరుకున్నాయి.

పటిష్ట ఓటు బ్యాంక్ ఉన్నా..
జిల్లాలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. గత ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు చోట్ల హస్తం గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులు గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే వీరిలో ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌ను వీడి భారత రాష్ట్ర సమితిలో చేరారు. అయినప్పటికీ తమ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని కాంగ్రెస్ నేతలు చాలా స్పష్టంగా చెబుతున్నారు. ఈ బలాన్ని చూసుకునే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి త్వరలో చేపట్టబోయే సుదీర్ఘ పాదయాత్రను భద్రాచలం నుంచి ప్రారంభించాలని నిర్ణయించుకున్నారని ఆ పార్టీ నేతల అంచనా. కానీ నాయకుల మధ్య విబేధాలు పార్టీకి చేటు చేస్తున్నాయనే అభిప్రాయం కాంగ్రెస్ కేడర్‌లో నెలకొంది.

పెరుగుతున్న కుమ్ములాటలు..
జిల్లాలో కాంగ్రెస్ నాయకుల మధ్య అంతర్గత కుమ్ములాటలు రోజురోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. ముఖ్యంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న నేతల సంఖ్య పెరుగుతోంది. పార్టీ కేడర్, నాయకుల మధ్య సమన్వయం చేయాల్సిన డీసీసీ చీఫ్ ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తూ పార్టీకి నష్టం చేస్తున్నారంటూ రచ్చకెక్కుతున్నారు. ఇప్పటికే పార్టీలోని అసమ్మతి నేతల ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలో సేవ్ కాంగ్రెస్ పేరుతో సమావేశం నిర్వహించారు. అసంతృప్త నేతలు బాహాటంగానే డీసీసీ చీఫ్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. పక్క జిల్లా నుంచి వచ్చినా సిట్టింగ్ ఎమ్మెల్యే కాబట్టి ఆయన నాయకత్వాన్ని ఆమోదిస్తున్నామని, కానీ పార్టీకి నష్టం చేసే నిర్ణయాలను సమర్థించలేమని తేల్చి చెప్పారు. ఒకరికి ఒకే పదవి పార్టీ విధానంగా చెబుతూ పొదెం వీరయ్యకు నాలుగు పదవులు ఎందుకు ఇచ్చారంటూ హైకమాండ్‌ను ప్రశ్నించారు. సేవ్ కాంగ్రెస్ పేరుతో మంగళవారం సమావేశం నిర్వహించిన అసంతృప్త నేతలు.. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన శిక్షణ శిబిరంలోనూ తమ వాదనలు వినిపించారు. ముఖ్యంగా శాసన సభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్కకు జిల్లాలోని పార్టీ పరిస్థితి, తమ ఇబ్బందులను వివరించారు. క్షేత్రస్థాయిలో కేడర్‌ను అయోమయానికి గురి చేసే విధంగా పొదెం వీరయ్య వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు.

ఐక్యత సాధ్యమేనా.. ?
జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉండగా ఇల్లెందు, అశ్వారావుపేట, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్లలో పొదెం వీరయ్యకు వ్యతిరేకంగా గళాలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం అసెంబ్లీ స్థానంలో టికెట్ ఆశిస్తున్న నేతలు డీసీసీతో సంబంధం లేకుండా నేరుగా పీసీసీ ద్వారానే తమ రాజకీయాలను చక్కబెట్టుకోవడంపై దృష్టి సారించారు. భద్రాచలంలో నియోజకర్గంలో రెండున్నర మండలాలు ఈ జిల్లాలో ఉండగా మరో రెండు మండలాలు ములుగు జిల్లాలో ఉన్నాయి. ఇలా హస్తం పార్టీ నేతలు అసమ్మతిని చల్లార్చే వారు లేకుండా పోయారనే వాదన వినిపిస్తోంది. అంతర్గత కుమ్ములాటలతో ఎవరికి వారే అన్నట్టుగా ఎన్నికల సమరం వైపు సాగిపోతున్నారని పార్టీ కేడర్‌లో చర్చ జరుగుతోంది. కనీసం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఈ నెలలో చేపట్టబోయే పాదయాత్ర నాటికైనా పార్టీలో అంతర్గత విభేదాలు తగ్గేలా హైకమాండ్ రంగంలోకి దిగాలని ఆ పార్టీ అభిమానులు కోరుతున్నారు.

వీరయ్యపైనే నమ్మకం
జిల్లాలో అసంతృప్త నేతలతో తనకు సంబంధం లేదన్నట్టుగా డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య తన పని తాను చేసుకుపోతున్నారు. ఆయన డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అసమ్మతి నేతలు తమ గళం వినిపిస్తూనే ఉన్నారు. ఇటీవల డీసీసీ చీఫ్‌గా ఆయనను తప్పించి లక్కినేని సురేందర్‌కు బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరిగింది. కానీ కాంగ్రెస్ పెద్దలు మరోసారి పొదెం వీరయ్యపైనే నమ్మకం ఉంచి రెండోసారి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. పీసీసీ తీరుతో మింగుడుపడని అసంతృప్త నేతలు టేకులపల్లి , ములకలపల్లి, మణుగూరు, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులను పొదెం ఏకపక్షంగా మార్చేయడాన్ని ఎత్తి చూపుతూ విమర్శలు ఎక్కుపెట్టారు.

పనుల్లో వేగం పెంచండి

- ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడా ప్రాంగణాలు, బృహత్ పల్లెప్రకృతి వనాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 1280 క్రీడా ప్రాంగణాలకు గాను ఇప్పటివరకు 433 గ్రౌండ్ అయ్యాయని, వాటిలో 391 ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మిగిలిన హ్యాబిటేషన్లలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణాల నిర్వహణపై నివేదిక అందజేయాలని డీఆర్‌డీఓకు సూచించారు. అటవీ భూముల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్డీఓలు సంయుక్తంగా ధ్రువీకరణ నివేదికలు అందజేయాలని చెప్పారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలు పూర్తి చేయాలని, కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విప్ రేగా కాంతారావు

టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విద్యాలత, బీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విప్ రేగా
మణుగూరు రూరల్: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం కలెక్టర్ అనుదీప్‌ను కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క, పండ్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఎస్పీ వినీత్‌ను కూడా రేగా కాంతారావు సన్మానించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి



భద్రాచలంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య, పక్కన ఏజే రమేష్, బ్రహ్మచారి తదితరులు

- హక్కుల సాధనకు ఆందోళన తప్పదు
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య

ఇల్లెందు/భద్రాచలం అర్బన్: రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎలాంటి హక్కులు లేకుండా బతుకులు వెళ్లదీస్తున్న కార్మికులు హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధ తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర బుధవారం జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా ఇల్లెందు, భద్రాచలంలో జరిగిన సభల్లో మాట్లాడారు. 2019 మోటార్ వాహన చట్టంలో సవరణలు చేయాలని, కేరళలోని 'సవారీ' తరహాలో యాప్‌ను దేశ వ్యాప్తంగా తీసుకువాలని, ఆర్టీసీ ఉద్యమంపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. ఓవర్‌లోడ్ పెనాల్టీలు తగ్గించాలని, ఆటో, టాటా మ్యాజిక్, జీప్, ట్రాలీలకు అడ్డాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్సూరెన్స్, పొల్యూషన్ పన్నులు విపరీతంగా పెంచారని, రోడ్ ట్యాక్స్ సైతం మూడు రెట్లు పెంచి విపరీతంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డు సాధనతో పాటు ఎంవీ యాక్టు సవరించాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 5న 'చలో పార్లమెంట్' చేపట్టనట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మచారి, ఏజే రమేష్, నాయకులు కూరపాటి రమేష్, ఈసం వెంకటమ్మ, అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, బోయిన శేఖర్, లింగాల రాము, ఆలేటి కిరణ్, వజ్జా సురేష్, రాంబాబు, నకిరికంటి నాగరాజు, లక్ష్మీకాంత్, జగన్, రామిరెడ్డి, బండారు శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తం ఇచ్చి.. ప్రాణదాతలుగా నిలవండి

ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్ధార్థ మొహంతి

బూర్గంపాడు: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్ధార్థ మొహంతి అన్నారు. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల్లో గాయపడి, అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అవసరమైన రక్తదానం చేస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. రక్తదాతలు వైద్యుల కంటే ఏమాత్రం తక్కువ కాదన్నారు. అనంతరం 150 మంది ఐటీసీ కార్మికులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ భాస్కర్‌రావు, విజయ్‌కుమార్,



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న సిద్ధార్థ మొహంతి

వైద్యులు నిఖిల్, అమృత, ఐటీసీ ఉన్నతాధికారులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు మరడాన శ్రీనివాస్, చెంగలరావు, బాషా, మురళి, శ్రీనివాస్, నంతియా, గాయత్రి, గాయత్రి, వినయ్, సుధాకర్‌రెడ్డి, వీవీఎస్ ప్రసాద్, దిలీప్, యూవీ రావు, పాకాల దుర్గాప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్‌గా శ్వేత

త్వరలో వెలువడనున్న ఉత్తర్వులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీ ఖరారైంది. ఈనెల 28తో ప్రస్తుత కమిటీకి పదవీకాలం ముగియనుండడంతో నూతన కమిటీ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. రిజర్వేషన్లు, రోస్టర్ ఆధారంగా మార్కెట్ చైర్‌పర్సన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. ఈమేరకు 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేతను చైర్‌పర్సన్‌గా, రఘునాథపాలెం మండలం ర్యాంకాతండాకు చెందిన ప్రస్తుత డైరెక్టర్ షేక్ అఫ్జల్‌ను వైస్ చైర్మన్‌గానే కాక మరో 12 మందిని డైరెక్టర్లుగా ప్రతిపాదించారు. సీఎం కేసీఆర్ అనుమతితో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ద్వారా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌గా డౌలె లక్ష్మీప్రసన్న ఉన్న కమిటీని 2021 జూలై 29న నియమించగా, 2022 జూలై 28తో గడువు ముగియడంతో ఆరు నెలల పాటు పొడిగించారు. ఈ పదవీకాలం 28వ తేదీన ముగియనున్న నేపథ్యాన కొత్త పాలకవర్గం ఏర్పాటుకు మంత్రి సిఫారసు చేశారు.



దోరేపల్లి శ్వేత

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

దుమ్ముగూడెం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, అందుకోసం ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ డీడీ రమాదేవి అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే మూడు నెలల పాటు కష్టపడి చదవాలని సూచించారు. 'పది' విద్యార్థులకు ప్రత్యేక మెనూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఎక్కువ మంది విద్యార్థులకు 10 జీపీఏ రావాలని ఆకాంక్షించారు. అనంతరం కిచెన్



కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న రమాదేవి

గార్డెన్‌ను పరిశీలించి విద్యార్థులకు ప్రతి రోజూ ఆకుకూరలు అందజేయాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట హెచ్‌ఎం మోతీర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

యువజనోత్సవాలు షురూ..

ఆటపాటల్లో ప్రతిభ చాటిన యువత

కొత్తగూడెంటౌన్: స్వామి వివేకానందను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని, విద్యతో పాటు కళలు, క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన క్రీడల అధికారి టి. సీతారాం అన్నారు. బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను డీపీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో సాంస్కృతిక విభాగంలో పోటీలు నిర్వహించగా, ప్రకాశం స్టేడియంలో కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా సీతారాం, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడా, కళాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. గత రెండేళ్లుగా కరోనా ప్రభావంతో యువజనోత్సవాలు నిర్వహించలేకపోయామని, ప్రస్తుత వేడుకలకు విద్యార్థులు, యువత భారీగా తరలిరావడం హర్షణీయమని అన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..
జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జానపద నృత్యాల పోటీల్లో రుద్రంపూర్ ఐటీఐకి ప్రథమ స్థానం, టీఎస్ఈఎంఆర్ఎస్ టేకులపల్లి కళాశాలకు ద్వితీయస్థానం, జానపద గేయాల పోటీల్లో టీటీడబ్ల్యూఆర్‌డీసీ (ఉమెన్స్) కళాశాల కొత్తగూడేనికి ప్రథమస్థానం, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజీ(ఉమెన్స్) ములకలపల్లికి ద్వితీయస్థానాలు లభించాయి. ఇక బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో జూలూరుపాడుకు చెందిన కె. సాయికుమార్ టీం ప్రథమ, వికాస్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.నాగేంద్రబాబు టీం ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో టేకులపల్లికి చెందిన సీహెచ్ రాధిక ప్రథమ, ములకలపల్లికి చెందిన కె. ప్రణతిశ్రీ ద్వితీయస్థానంలో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా పమ్మి రవి, కాంపెల్లి బాలు, అర్జున్‌రావు, కృపానందం, ధనలక్ష్మి, మూసా, గురువయ్య వ్యవహరించారు. యువజన క్రీడల శాఖ సిబ్బంది ఉదయ్‌కుమార్, తిరుమలరావు, పి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంక్లబ్‌లో జరిగిన యువజనోత్సవాల్లో విద్యార్థుల నృత్యం



యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాధికారి, డీపీఆర్‌ఓ తదితరులు



విద్యార్థుల ప్రదర్శన



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికల జట్టు

'సెయింట్ జోసెఫ్'లో 8న 6కే రన్..

సింగరేణి(కొత్తగూడెం) : కొత్తగూడెంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఏర్పాటై 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 8వ తేదీన 6కే రన్ నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు సాయికృష్ణ, పసుపులేటి శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో వజ్రోత్సవాలు ఉంటాయని చెప్పారు. సాహితి, సాంస్కృతిక, క్రీడా, విద్యా విషయాల్లో తమ పాఠశాల తనదైన ముద్ర చాటుతోందన్నారు. 'ఇంతింతై వటుడింతై' అన్నట్టుగా పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోందని, 2013లో అంబరాన్నంటేలా స్వర్ణోత్సవాలు జరుపుకున్నామని చెప్పారు. వజ్రోత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈనెల 8న సెంట్రల్ పార్క్ నుంచి ప్రకాశం స్టేడియం వరకు 6కే రన్ నిర్వహించచన్నిట్లు వివరించారు. జిల్లాలోని 20 పాఠశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు, సింగరేణి ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్. బలరామ్, జిల్లాలోని పలువురు అధికారులు పాల్గొంటారని వివరించారు. పట్టణ ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రన్‌లో మూడు విభాగాలు ఉంటాయని, ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికీ బహుమతి అందిస్తామని వివరించారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర రెడ్డి, పూర్వ విద్యార్థులు డాక్టర్ రోజాకిరణ్, పూర్వ విద్యార్థులు కవిత, షేక్స్‌పియర్, మొబిన్ పాషా, వైస్ ప్రిన్సిపల్ జోషి, డాక్టర్ మాలతీ, ఎల్‌జే ప్రవీణ్, బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

7న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

చుంచుపల్లి: పాల్వంచకు చెందిన ప్రముఖ ఇండస్ట్రియల్ డిటెక్టివ్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలో ఉద్యోగాల నిమిత్తం నిరుద్యోగ యువకులకు ఈ నెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి బయోడేటా, సర్టిఫికెట్లతో ఈ నెల 7 తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాంగణంలోని మున్సిపాలిటీ కాంప్లెక్స్‌లో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 77994 70817లో సంప్రదించాలని కోరారు.

ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయొద్దు

భద్రాచలంఅర్బన్: ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయొద్దంటూ పట్టణ పోలీసులు మంగళవారం పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు స్థానిక మనుబోతుల చెరువు వద్ద గుడిసెలు వేసేందుకు సన్నాహాలు చేశారు. భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు అక్కడికి వెళ్లి సదరు వ్యక్తులను గుడిసెలు వేయొద్దని కోరగా నిరాకరించారు. ఈఓ సమాచారంతో అక్కడకు చేరుకున్న పట్టణ సీఐ నాగరాజురెడ్డి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపించివేశారు. ఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం

బూర్గంపాడు: మండలంలోని పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన తంబళ్ల నిష్మ అనే యువతి అదృశ్యంపై బుధవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. యువతి తండ్రి బాబూరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. ఈ నెల 1వ తేదీన తన కుమార్తె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

బూర్గంపాడు: మండలంలోని సారపాక పుష్కరవనం వద్ద ఈ నెల 1వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో కారు డ్రైవర్ రాజీవ్‌రెడ్డిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కారు, మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో పాల్వంచకు చెందిన సాయిదీక్షిత్, అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంతోష్ కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలతో బెంబేలు..

పాల్వంచరూరల్: మండలంలో చీకటిపడితే చాలు దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. చోరీలకు పాల్పడుతున్నారు. నాగారం గ్రామశివారులో ఉన్న స్టోన్ క్రషర్ మిల్లులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. రూ.70 వేల విలువైన ఐరన్ వస్తువులు, మోటారు, స్టార్టర్లను అపహరించారు. క్రషర్ సూపర్‌వైజర్ కె.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గత నెల రోజుల క్రితం నారాయణరావుపేటలో చంద్రారెడ్డి, శ్రీనివాస రెడ్డి, భార్గవ్ అనే రైతులకు చెందిన పంట పొలాల వద్ద విద్యుత్ మోటార్లకు చెందిన వైర్లను దొంగలు చోరీ చేశారు. దీంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైర్ల చోరీతో మోటార్లు నడవక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.

వేధింపుల కేసు నమోదు

బూర్గంపాడు: తన భర్త అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నాడని మండలంలోని సారపాకకు చెందిన సువర్చల అనే వివాహిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రాజేష్ తనపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు పట్టణంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,741

సొసైటీ సొమ్ము స్వాహా..

- నెల్లిపాక సహకార సంఘంలో రూ.20 లక్షల దుర్వినియోగం
- సంఘం సీఈఓను సస్పెండ్ చేయాలని డీసీఓ ఆదేశం



నెల్లిపాక సహకార సంఘం కార్యాలయం

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2021–22 ఏడాది ఆడిట్ నివేదికలో రూ.20 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు అధికారులు గుర్తించారు. సహకార సంఘం ప్రస్తుత పాలకవర్గం ఏర్పాటైన తర్వాత 2020 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు రెండు సార్లు ఆడిట్ చేశారు. అధికారులు 2022 ఏప్రిల్ 23న, 2022 డిసెంబర్ 15న ఆ ఆడిట్ రిపోర్టులను ఉన్నతాధికారులకు అందజేశారు. అవకతవకలు జరిగిన రెండు ఆడిట్‌లకు సంబంధించి స్పెషల్ ఆడిట్ నివేదికలో కూడా రూ.20,06,252 దుర్వినియోగం జరిగినట్టు అధికారులు గుర్తించి నివేదిక అందజేశారు. 2022 మార్చి 31 నాటికి నగదు నిల్వలో రూ.15,04,181, ట్రాన్స్‌పోర్టు చార్జీలలో అధిక లెక్కలు రూ.1,50,000, టార్పాలిన్ల కొనుగోలులో క్యాష్ బుక్‌లో నమోదు చేయకుండా ఉన్న డబ్బు రూ.1,37,150, గన్నీ బ్యాగులకు సంబంధించి రూ.1,74,669, ఎఫ్‌డీకి సంబంధించిన వడ్డీ ఓచర్ లేకుండా చెల్లించనవి రూ.27,054, ఓచర్ లేకుండా చెల్లించిన డబ్బు రూ.13,198 దుర్వినియోగమైనట్లు నివేదికలో పేర్కొన్నారు. మొత్తం రూ.20,06,252 దుర్వినియోగం జరిగినట్టు నివేదించారు. సంఘం పాలకవర్గ సమావేశం నిర్వహించి ఇందుకు బాధ్యుడైన సంఘం సీఈఓ రామారావును సస్పెండ్ చేయాలని డీసీఓ ఆదేశిస్తూ ఈ నెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం అధ్యక్షుడు రోజూ జరిగే ఆర్థిక, పాలనా వ్యవహారాలపై సరిగ్గా పర్యవేక్షించలేదని నివేదికలో పేర్కొన్నారు. నియమనిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులు సిఫార్సు చేశారు. దుర్వినియోగం, అవకతవకలకు సంబంధించి అధికారులు ఇంకా పలు అంశాలను గుర్తించారు. గతంలో సహకార సంఘంలో అవకతవకలు జరగ్గా అప్పటి సీఈఓపై చర్యలు తీసుకున్నారు. జిల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా అవార్డులు పొంది జిల్లాలో మొదటి మూడు సహకార సంఘాలలో ఒకటిగా నెల్లిపాక పేరొందింది. అలాంటి సహకార సంఘంలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరుగుతుండటంతో సంఘం సభ్యులు, రైతులు సంఘం ఆర్థిక లావాదేవీలు, పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న బోధనోపకరణాల మేళా



మేళాలో ప్రదర్శనలను పరిశీలిస్తున్న అధికారులు



బోధనోపకరణాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో బుధవారం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బోధనోపకరణాల మేళా (ఎఫ్‌ఎల్ఎన్) ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మడివి సరస్వతి, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల బోధనా పద్ధతిని సులభతరం చేసేందుకు, అభ్యసన ప్రక్రియ వేగవంతం చేసేందుకు బోధనోపకరణాలు ఉపయోగపడతాయని తెలిపారు. మండలంలోని ఐదు కాంప్లెక్స్‌ల పరిధిలోని 64 పాఠశాలల నుంచి 168 మంది ఉపాధ్యాయులు పాల్గొని 863 ప్రదర్శనలు నిర్వహించారు. విద్యాశాఖ మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్, సెక్టోరియల్ ఆఫీసర్ ఎస్‌కె.సైదులు ఎగ్జిబిట్లను పరిశీలించారు. కాగా 20 బోధనోకరణాలను జిల్లా స్థాయిపోటీలకు ఎంపిక చేసినట్లు నోడల్ ఆఫీసర్ ప్రకాశ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రవీంద్ర ప్రసాద్, ఎంఈఓ శ్రీరాంమూర్తి, నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రావు, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సింగరేణి(కొత్తగూడెం): మహిళలు ఆర్థికంగా ఎదగాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు జక్కం వాణీ రమేష్ సూచించారు. బుధవారం ఆమె రుద్రంపూర్ సేవా సెంటర్‌ను సందర్శించి, టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. సింగరేణి సంస్థ పరిసర ప్రాంత నిరుద్యోగ, మహిళలకు చేయూతనందిస్తోందని తెలిపారు. అనంతరం నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. ఆ తర్వాత ప్రశాంత్ నగర్‌లో టైలరింగ్ శిక్షణ రెండో బ్యాచ్‌ను ఆమె ప్రారంభించారు. సేవా సెక్రటరీ భూలక్ష్మి, మాధవీ నారాయణరావు, ఫాతిమారజాక్, మురళి, సాగర్, రామాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టైలరింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న సేవా అధ్యక్షురాలు

వాటర్ ట్యాంక్ ఎక్కిన డైలీవేజ్ కార్మికులు

అధికారుల చొరవతో కిందకు దిగొచ్చిన వర్కర్లు



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న కార్మికులు

పాల్వంచ: గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేసే డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పాల్వంచలోని ఆశ్రమ గిరిజన హాస్టల్‌లో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కారు. అధికారులు, పోలీసుల చొరవతో కిందకు దిగారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన ఆశ్రమ వసతి గృహాలు, పాఠశాలల్లో పనిచేసే డైలీవేజ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలు చెల్లించాలని 70 రోజులుగా జిల్లా వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కార్మికులు వెంకట్రావు, అర్జున్, కృష్ణకుమారి, రమాకళ, కల్యాణ్, రాజేశ్వరి హాస్టల్‌లోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశారు. మరికొందరు కార్మికులు కూడా ట్యాంక్ ఎక్కుతుండగా అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు అడ్డుకున్నారు. తహసీల్దార్ రంగా ప్రసాద్, ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు తదితరులు ఆందోళనవద్దకు చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఐటీడీఏ డీడీ రమాదేవితో ఫోన్‌లో మాట్లాడించారు. వారంలోగా పెండింగ్ వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు వాటర్ ట్యాంక్‌పై నుంచి కిందకు దిగారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, సాయిరాం, మంగీలాల్, వెంకట్రావు, సేవ్యా, శాంత, కాంతమ్మ, కల్యాణి, లక్ష్మి, బాబూరావు, నర్సింహారావు, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ శిక్షణకు హాజరైన కాంగ్రెస్ నాయకులు



శిక్షణకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం ఒక్క రోజు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు పాల్గొన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర, ఎన్నికల నిబంధనలు, నియమావళి, మీడియా రిలేషన్స్ తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జెబీ శౌరీ, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు మాలోత్ రాందాస్, ఎడవల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీపీఎల్ విజేత.. ఇండస్

- రన్నరప్‌గా ప్రకాష్ ప్రాజెక్ట్స్ జట్టు
- ట్రోఫీలు అందజేసిన మంత్రి పువ్వాడ



రన్నరప్‌గా ట్రోఫీ అందుకుంటున్న ప్రకాష్ ప్రాజెక్ట్స్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: పువ్వాడ ప్రీమియర్ లీగ్(పీపీఎల్) టీ–20 క్రికెట్ టోర్నీ విజేతగా ఇండస్ హాస్పిటల్ ఖమ్మం జట్టు నిలిచింది. రన్నరప్ ట్రోఫీని ప్రకాష్ ప్రాజెక్టు భద్రాచలం జట్టు దక్కించుకుంది. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న పీపీఎల్ టోర్నీలో బుధవారం ముగిసింది. ఈమేరకు ప్రకాష్ ప్రాజెక్ట్స్ – ఇండస్ హాస్పిటల్ జట్లు ఫైనల్స్‌లో తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాష్ ప్రాజెక్టు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 123 ఆలౌట్ అయింది. జట్టు బ్యాట్స్‌మెన్లు రోనాల్డ్ 15, అనిరుధ్ 16, బన్నీ 37, నీరజ్ 9, తనుష్ 21 పరుగులు చేయగా, ఇండస్ జట్టు బౌలర్లలో అజయ్ నాలుగు, రాహుల్, లోకేష్ రెండేసి వికెట్లతో పాటు నందు ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇండస్ జట్టు 19.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించింది. ఈ జట్టులో జయరాం 28, ముకేష్ 22, ప్రశాంత్ 11, సాయిరాహుల్ 13, అజయ్ 14, నందు పరుగులు చేశారు. ఇక ప్రకాష్ ప్రాజెక్ట్స్ జట్టు నీరజ్ నాలుగు వికెట్లు తీసుకోగా ఇందులో హాట్రిక్ ఉండడం విశేషం. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మేయర్ పునుకోల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ట్రోఫీలు అందజేశారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.డీ.మసూద్ పాషా, సీపీఐ, సీపీఎం నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు, స్వర్ణ హాస్పిటల్ అధినేత కాకి భాస్కర్‌పాల్గొన్నారు.

మరిన్ని పోటీలు నిర్వహిస్తాం

క్రీడాకారులను ప్రోత్సహించేలా మరిన్ని పోటీలు నిర్వహిస్తామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. విజేతలకు ట్రోఫీలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ క్రికెట్ మాత్రమే కాక ఇతర క్రీడా పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని క్రీడా సంఘాలను కోరారు. పువ్వాడ ఉదయ్ కుమార్ స్మారకార్థం నిర్వహించిన పీపీఎల్ – 3ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాగా, అన్ స్టాపబుల్ హీరో సన్నీ ఈకార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, ఇలాంటి క్రికెట్ పోటీలు ఖమ్మంలో జరగడం గర్వంగా ఉందని చెప్పారు. ఈసందర్భంగా విజేత జట్టుకు రూ.2.50లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.1.50లక్షల నగదు, ట్రోఫీలు అందజేశారు.

సహజీవనం చేసి పెళ్లికి నిరాకరిస్తున్నాడని

ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వప్న

పెనుబల్లి : భర్తతో విడాకులు తీసుకున్న మహిళ.. తన ప్రియుడితో సహజీవనం చేస్తుండగా ఆయన పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాళ్లగూడెంకు చెందిన కంటిపూడి స్వప్నకు గతంలో వివాహం జరగగా భర్తతో విడాకులు తీసుకుని ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలోని అక్కడ ఇంటి వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తోంది. అదే గ్రామానికి చెందిన మామిడి నాగరాజుతో ఏర్పడిన పరిచయంతో నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. అయితే, తనను పెళ్లి చేసుకోవాలని స్వప్న కోరగా నాగరాజును నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె బుధవారం వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇద్దరినీ పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం బయటకు వెళ్లిన స్వప్న నాగరాజు తనను పెండ్లి చేసుకోవడానికి ఒప్పుకోవడం లేదనే మనస్తాపంతో పోలీస్ స్టేషన్ ఎదుటే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను బంధువులు పెనుబల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'నవభారత్' మృతుడి కుటుంబానికి నష్టపరిహారం

- రూ. 6 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించిన యాజమాన్యం

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌లో గాయపడి మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. కర్మాగారంలోని పవర్ ప్లాంట్‌లో దామల్ల రాంబాబు అనే కార్మికుడు సీనియర్ ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నాడు. స్విచ్‌యార్డ్‌లో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మంగళవారం అర్ధరాత్రి మృతుడి కుటుంబీకులు కర్మాగారం ముందు ఆందోళన చేపట్టారు. ఈక్రమంలో బుధవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటి వద్ద ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ తదితరుల ఆధ్వర్యంలో నవభారత్ జీఎం రాజే శ్వరరావు, డీజీఎం రామారావులతో చర్చలు జరిపారు. దీంతో యాజమాన్యం నష్టపరిహారం కింద రూ.6 లక్షలు, సంస్థ, కాంట్రాక్టర్ ద్వారా అందాల్సిన అన్ని రకాల ఇన్సూరెన్స్ అందించేందుకు అంగీకరించినట్లు జీఎం రాజేశ్వరరావు తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవర్

ఆటో ఢీకొని ఐదుగురికి గాయాలు



మద్యం మత్తులో ఆటో నడిపిన వేణుగోపాల్

కొత్తగూడెంటౌన్: మద్యం మత్తులో డ్రైవర్ ఆటోతో ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడటంతోపాటు ఐదుగురికి గాయాలైన సంఘటన బుధవారం వన్‌టౌన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. బాబుక్యాంప్‌నకు చెందిన వేణుగోపాల్ అతిగా మద్యం తాగి ఆటో నడుపుకుంటూ రామాటాకీస్ ఏరియా నుంచి బాబుక్యాంప్ వైపు వెళ్తున్నాడు. మద్యం మత్తులో రోడ్డుపై వెళ్తున్న ఐదుగురిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రశాంత్, సోను, చక్రవర్తితోపాటు మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆటోడ్రైవర్‌ను పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తను హతమార్చిన భార్య

నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు

చుంచుపల్లి: ఉద్యోగం కోసం భర్తను హతమార్చిన మహిళను చుంచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు. ఎస్‌ఐ సుమన్ కథనం ప్రకారం... మండల పరిధిలోని గాంధీ కాలనీకి చెందిన కొమ్మురబోయిన శ్రీనివాస్‌కు 29 సంవత్సరాల క్రితం సీతామహాలక్ష్మితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు సాయికుమార్, భవాని ఉన్నారు. శ్రీనివాస్ రెవెన్యూ శాఖలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మద్యానికి బానిసై విధులకు సక్రమంగా వెళ్లేవాడుకాదు. దీంతో శ్రీనివాస్ దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో భర్తను చంపి ఆ ఉద్యోగం తీసుకుని సంతోషంగా ఉండాలని సీతామహాలక్ష్మి పన్నాగం వేసింది. ఈ క్రమంలో భర్త తదనంతరం ఉద్యోగం తనకే వచ్చేలా భర్త, పిల్లలతో అగ్రిమెంట్ కూడా రాయించుకుంది. గత నెల 29న రాత్రి శ్రీనివాస్ మద్యం తాగి వచ్చి పడుకున్నాడు. ఇదే అదునుగా భావించిన ఆమె.. భర్త తల వెనుక భాగంలో కర్రతో గట్టిగా కొట్టింది. స్పృహ కోల్పోగా ఇంట్లోనే మరోచోట పడుకోబెట్టింది. ఆ తర్వాత అనుమానం రాకుండా శ్రీనివాస్‌తో పని చేసే వాళ్లకు ఫోన్ చేసి ఇంట్లో కాలు జారి కింద పడ్డాడని చెప్పింది. తాను కిరాయికి ఉంటున్న ఇంటి యజమానికి కూడా అదే విషయం చెప్పి నమ్మించింది. అనంతరం ఆటోలో భర్తను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతూ శ్రీనివాస్ మరుసటి రోజు చెందాడు. మృతుడి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా విషయం ఎక్కడ బయటకొస్తుందోననే భయంతో నిందితురాలు హైదరాబాద్ బయల్దేరి వెళ్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చిందని ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

మరో ఇద్దరినీ విడిచిపెట్టిన మావోయిస్టులు



మావోయిస్టుల చెర నుంచి బయటపడిన కాంట్రాక్టర్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు కాంట్రాక్టర్లను గత నెల 24న కిడ్నాప్ చేసిన మావోయిస్టులు ఇప్పటికే విడుదల చేయగా, మిగిలిన వారినీ విడుదల చేశారు. కిడ్నాప్ చేసిన కొండగావ్‌కు చెందిన నిమేంద్రకుమార్ దేవాన్, నీల్‌చంద్‌నాగ్‌ను మంగళవారం విడిచిపెట్టిన విషయం విదితమే. లోహందిగూడకు చెందిన టటెమునాగ్, బార్సూర్‌కు చెందిన చప్పిడి బత్తయ్యను బుధవారం విడిచిపెట్టగా వారు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈమేరకు కాంట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని కిడ్నాప్‌నకు కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే, మావోయిస్టులు ఎవరికీ హానీ తలపెట్టకుండా సురక్షితంగా విడిచిపెట్టడంపై కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి కేసులో 10 ఏళ్ల జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన మిలింద్ షిండేకు 10 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శ్యాంశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. 4.9.2022న భద్రాచలంటౌన్‌లో ఎస్‌ఐ బి.మహేష్ బృందంతో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా 21.100 కేజీల గంజాయి లభ్యమైంది. కారులో గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన అమరావతి జిల్లా సుల్తానాపూర్‌కు చెందిన విలాస్ బర్కాజీ, నాగపూర్ జిల్లా శాంతినికేతన్ నగర్‌కు చెందిన మిలింద్ షిండేలను అరెస్ట్ చేశారు.

కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారు. దర్యాప్తు అనంతరం భద్రాచలంటౌన్ సీఐ టీ.స్వామి చార్జీషీట్ కోర్టులో దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించిన న్యాయస్థానం కేసులో ఏ–2 నిందితుడు మిలింద్ షిండేకు 10 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. ఏ–1 విలాస్ బర్కాజి కోర్టుకు హాజరుకానందున వారెంట్ పెండింగ్‌లో ఉంది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమ్మరి రామారావు వాదించారు. లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, భద్రాచలంటౌన్ కోర్టు ఏఎస్‌ఐ గంజి శ్రీధర్ సహకరించారు.

పట్టపగలే చోరీ

10 తులాల బంగారం అపహరణ

బూర్గంపాడు: మండలంలోని సారపాకలో బుధవారం పట్టపగలే బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. సారపాకలోని గాంధీనగర్‌లో నివా సముంటున్న గ్రామపంచాయతీ వర్కర్ యాకుబ్ బుధవారం విధి నిర్వహణకు వెళ్లా డు. మధ్యాహ్నం సమయంలో యాకుబ్ భార్య ఇంటి తలుపులు దగ్గరకు వేసి పక్క ఇంటికి వెళ్లింది. అరగంట తర్వాత ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బీరువా కూడా పగులగొట్టి ఉంది. బీరువాలోని 10 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంతోష్ డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ బృందాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

శ్రీనగర్ కాలనీలో...

పాల్వంచ: పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న ఓ ఇంట్లో నగదు, బంగారు వస్తువులు చోరీ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీనగర్ కాలనీ నివాసం ఉంటున్న పోస్ట్‌మాస్టర్ సయ్యద్ హైదర్ గత శనివారం హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. కాగా అతని కుమారుడు అతిక్ బుధవారం ఇంటికి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా 35 గ్రాముల నెక్లెస్, 5 గ్రాముల దిద్దులు, రూ.58 వేల నగదు వరకు చోరీ అయినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా బాధితుల నుంచి ఇంకా ఫిర్యాదు రాలేదని తెలిపారు.



డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

ఆవులను అపహరించే ప్రయత్నం...

శాస్త్రిరోడ్‌లో భజన మందిర రామాలయంలో దొంగలు మంగళవారం రాత్రి టాటా మ్యాజిక్ తీసుకొచ్చి ఆవులను వాహనంలో ఎక్కించే ప్రయత్నం చేశారు. అలికిడికి వాచ్‌మెన్ శివ మేల్కొని గట్టిగా కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు వివరాలు వెల్లడించారు.